ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి

మధు రాజీనామా వద్దు

జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామాను విరమింపజేసిన కేసీఆర్

మంథని, డిసెంబర్ 5: పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని చూస్తున్న పుట్ట మధుకర్ ఆలోచనను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విరమింపజేశారు. జడ్పీచైర్మన్‌గా పుట్ట మధు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ మంథనిలో బీఆర్ఎస్ ఓటమికి నైతికబాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి విషయాన్ని వివరించారు. కేసీఆర్ స్పందిస్తూ.. ఓటమి ఒక్క మంథని నియోజకవర్గంలో లేదా పెద్దపల్లి జిల్లాలో జరిగిన అంశం కాదని తెలిపారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రతిపక్ష పాత్ర పోషించాలని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మ్యానిఫెస్టో హామీలను అమలు చేసేలా పోరాడాలని, ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉండి జిల్లా కార్యకర్తలకు అండగా ఉండాల్సిన బాధ్యత ఉందని పుట్ట మధుకు సూచించారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో కలిసిన పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు దంపతులు

లోకం పోకడ

బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేక కార్యకర్త మృతి

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలో ఘటన

ఆవునూరి దేవయ్య (ఫైల్)

గంభీరావుపేట, డిసెంబర్ 5: రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు ఓడిపోవడంతో కేసీఆర్ అమలు చేసిన పథకాలు మళ్లీ తమ లాంటి పేదోళ్లకు అందుతాయో? లేదో? అని బీఆర్ఎస్ కార్యకర్త గుండెపోటుతో మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఆవునూరి దేవయ్య (50), ఆయన ముగ్గురు కొడుకులు బీఆర్ఎస్ కార్యకర్తలు. పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం జరిగినా చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అప్పటి నుంచి దేవయ్య దిగులు చెందాడు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాకపోవడంతో తాను రైతుబంధు పొందుతున్నాని, మంజూరైన డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించుకుంటున్నానని, మళ్లీ ఈ పథకాలు అమలు చేస్తారో లేదోనని ఆందోళన చెందాడు. ఇదే విషయమై రెండు రోజులుగా ఇరుగు పొరుగు వారితో ముచ్చటించాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఆలోచిస్తుండగానే గుండెనొప్పి వచ్చి దేవయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దవాఖానకు తరలించే క్రమంలోనే చనిపోయాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సిరిగిరి లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డి, ఉపసర్పంచ్ అరుట్ల అంజిరెడ్డి, గ్రామాధ్యక్షుడు కొలనూరి వేణు, ఎంపీటీసీ సభ్యురాలు మూడావత్ కవిత మృతుడి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నాడని పార్టీ నాయకులు, గ్రామస్థులు దేవయ్య సేవలను గర్తుచేసుకున్నారు.

సంపత్‌రెడ్డి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా, కడియం, మాజీ మంత్రి ఎర్రబెల్లి, ముత్తిరెడ్డి తదితరులు

సంపత్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడె మోస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ఆర్టీసీలో 'ఈఆర్పీ.. సేవలు వేగవంతం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రయాణికులకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు దేశంలోనే తొలిసారి ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్పీ) ప్రాజెక్టుకు టీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. నల్సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి అన్ని సేవలను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చింది. సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఈఆర్పీ సేవలను ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని డిపోలు, జోన్లతోపాటు ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను ఏకీకృతం చేసే ఈఆర్పీతో టీఎస్ఆర్టీసీ మరింత అభివృద్ధి చెందగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు టీఎస్ఆర్టీసీతో కలిసి పనిచేయడం సంతోషాన్ని కలిగిస్తున్నదని నల్సాఫ్ట్ సీఈవో నల్లూరి వెంకట్ తెలిపారు.

కార్పొరేషన్ పోస్టులకు ఇద్దరు రాజీనామా

సీఎస్ శాంతికుమారికి కార్పొరేషన్ చైర్మన్ల లేఖలు

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇద్దరు తమ కార్పొరేషన్ చైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమం మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, తెలంగాణ చేనేత అభివృద్ధి సంస్థ (టీఎస్‌హెచ్‌డీసీ) చైర్మన్ చింతా ప్రభాకర్ రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను మంగళవారం వేర్వేరుగా సీఎస్ శాంతికుమారికి పంపించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలువురికి కార్పొరేషన్ పదవులను కట్టబెట్టింది. కొత్తగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరనుండటంతో వారు తమ పదవులకు రాజీనామాలు చేశారు. 21 మాసాలపాటు ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, మాజీ మంత్రులు కేటీఆర్‌కు, హరీశ్‌రావుకు, సబితాఇంద్రారెడ్డికి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు శ్రీధర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి చింతా ప్రభాకర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రభుత్వం మారడంతో తన చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు సీఎస్‌కు పంపిన లేఖలో చింతా ప్రభాకర్ పేర్కొన్నారు.

గులాబీ సైనికుడికి కన్నీటి వీడ్కోలు

మొదటిపేజీ తరువాయి...

పరామర్శించి, ఓదార్చారు. సంపత్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే రాజవరం చేరుకొన్న జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి సోమవారం నుంచి మొదలుకొని మంగళవారం పాగాల అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంపత్‌రెడ్డి అంత్యక్రియల్లో ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా చూసుకున్నారు. ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టీ రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలతోపాటు ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రాజవరంలోని ఇంటి నుంచి వ్యవసాయ క్షేత్రం వరకు సాగిన అంతిమయాత్రలో పల్లా, కడియంసహా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని, పార్టీ సహచరుడికి తుది వీడ్కోలు పలికారు.

నేడు పార్టీ కార్యాలయాల్లో నివాళి: కేటీఆర్

బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం బాధాకరం అని కేటీఆర్ పేర్కొన్నారు. 14 ఏండ్లు కేసీఆర్ వెంట సైనికుడిలా పని చేశారని, ఆయన మరణం కార్యకర్తలను కలిచివేసిందని చెప్పారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేశారని గుర్తుచేశారు. సంపత్ కుటుంబానికి కేసీఆర్, పార్టీ శ్రేణుల తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంపత్‌కుమార్తె చదువు బాధ్యతసహా ఆర్థిక ఇబ్బందులను సైతం పార్టీ తీరుస్తుందని చెప్పారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జడ్పీ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నివాళులు అర్పించాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
నల్లగొండ	19.0°c	25.3°c
మెదక్	19.1°c	29.4°c
రంగారెడ్డి	19.2°c	30.1°c
నిజామాబాద్	20.5°c	28.7 °c
హైదరాబాద్	20.6°c	24.6°c
ఆదిలాబాద్	22.0°c	32.2°c
కరీంనగర్	22.0°c	26.0°c
వరంగల్	22.0°c	24.0°c
ఖమ్మం	22.0°c	26.0°c
మహబూబ్‌నగర్	22.5°c	26.5°c

సీఎంగా రేవంత్

మొదటిపేజీ తరువాయి...

అంగీకరించినట్టు సమాచారం. అనంతరం వారిద్దరి సమక్షంలోనే విలేకరుల సమావేశం నిర్వహించిన కేసీ వేణుగోపాల్.. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి పేరును ప్రకటించారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడకుండానే బయటకు వెళ్లిపోగా.. భట్టి విక్రమార్క ఈ అంశంపై స్పందించలేదు.

వన్‌మ్యాన్ షో ఉండదు

సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి ప్రకటించిన సమయంలో కేసీ వేణుగోపాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో సీనియర్లకు సముచిత గౌరవం ఉంటుందని, వారికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదని తెలిపారు. అదే సమయంలో పార్టీలో, ప్రభుత్వంలో వన్‌మ్యాన్ షో (ఏకచత్రాధిపత్యం) ఉండబోదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలపై డీకే శివకుమార్, ఠాక్రే ఇచ్చిన నివేదికతోపాటు అధిష్ఠానం నిర్ణయం ప్రకారమే సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు.

రేపు ప్రమాణం

సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ముహూర్తం కూడా ఖరారైంది. సీఎల్పీ నేతగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి.. సీఎంగా గురువారం (7వ తేదీ) ఉదయం ప్రమాణం చేయనున్నారు. ఎల్బీ స్టేడియంలో ఉదయం 10.30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లపై సీఎస్ శాంతికుమారి మంగళవారం సమీక్ష నిర్వహించారు. అయితే రేవంత్‌రెడ్డి ఒక్కరే ప్రమాణం చేస్తారా? లేక ఆయనతోపాటు డిప్యూటీ సీఎం లేదా మంత్రులు ఎవరైనా ప్రమాణం చేస్తారా? అనేది తేలాల్సి ఉన్నది. ఈ సభలోనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కీలక నిర్ణయం తీసుకొనే అవకాశం ఉన్నది.

ఢిల్లీకి రేవంత్

సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం.. ఆయనను ఢిల్లీకి రావాలని ఆదేశించింది. దీంతో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో రేవంత్ ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. సీఎంగా తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీలను ఆహ్వానించారు. దీంతోపాటు సీఎల్పీ నేతగా ఎంపిక చేసిన నేపథ్యంలో క్యాబినెట్ కూర్పుపై అధిష్ఠానంతో చర్చించినట్టు తెలిసింది. జిల్లాలవారీగా, కులాలవారీగా ఎవరికి మంత్రి పదవులు ఇవ్వాలి? ఎవరికి ఏ శాఖ ఇవ్వాలి? అనే దానిపై అధిష్ఠానం ఆయనతో చర్చించినట్టు సమాచారం.

ఖర్గే, సోనియాకు కృతజ్ఞతలు..: రేవంత్‌రెడ్డి

సీఎల్పీ నేతగా తనను ఎంపిక చేసినందుకు అధిష్ఠానానికి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, మాణిక్‌రావ్ ఠాక్రేకు ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో పార్టీ కోసం నిరంతరం కష్టపడి ఈ విజయాన్ని కట్టబెట్టిన కార్యకర్తలకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కార్యకర్తల సంబురాలు

రేవంత్‌రెడ్డి సీఎం కానుండటంతో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు సంబురాల్లో మునిగిపోయారు. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి పేరును కేసీ వేణుగోపాల్ ప్రకటించగానే రాష్ట్రవ్యాప్తంగా పటాకులు కాల్చి, సంబురాలు చేసుకొన్నారు. సోషల్‌మీడియాలోనూ రేవంత్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. చాలారోజుల తర్వాత గాంధీభవన్ కొత్త కళను సంతరించుకొన్నది. రంగులతట్లతో గాంధీభవన్‌ను ముస్తాబు చేశారు.

రేవంత్ రెడ్డి కుటుంబ నేపథ్యం..

1969 ఆగస్టు 8న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గంలోని కొండారెడ్డిపల్లెలో నరసింహారెడ్డి, రామచంద్రమ్మ దంపతులకు రేవంత్‌రెడ్డి జన్మించారు. ఆయనకు మొత్తం ఆరుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన రేవంత్‌రెడ్డి ఇంటర్ ఓ ప్రైవేట్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం డిగ్రీ చేసేందుకు హైదరాబాద్ వచ్చారు. ఉస్మానియా అనుబంధ ఏవీ కాలేజీలో డిగ్రీ (ఫైన్ ఆర్ట్స్) పూర్తి చేశారు. చిన్ననాటినుంచి నాయకత్వ లక్షణాలున్న రేవంత్ పాఠశాలలో చదివే రోజుల్లోనే స్టూడెంట్ లీడర్‌గా ఉన్నారు. దూకుడుగా, చురుగ్గా ఉండే రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలపై పోరాడేవారు. ఏబీవీపీ స్టూడెంట్ యూనియన్‌లో మెంబర్‌గా చేశారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత పెయింటర్‌గా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత సోదరుడితో కలిసి ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు. అది విజయవంతం అవ్వడంతో.. రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించిన ఆయన ఆర్థికంగా నిలదొక్కుకొన్నారు. 1992లో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి సోదరుడి కుమార్తె గీతారెడ్డిని ప్రేమ వివాహం చేసుకొన్నారు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు.

ఓటుకు నోటు కేసులో..

2015లో తెలంగాణ శాసన మండలి ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలంటూ.. నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి లంచం ఇవ్వజూపారంటూ ఒక స్టింగ్ – ఆపరేషన్ వీడియోతో సహా ఆరోపణలు రావటంతో ఏసీబీ ఆయనను అరెస్టు చేసింది. 45 రోజులకుపైగా జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలయ్యారు. ఇది అప్పట్లో రాష్ట్రంలో సంచలనం రేపింది.

రేవంత్ రాజకీయ ప్రస్థానం

టీఆర్ఎస్ ఆవిర్భావంలోనే పార్టీలో చేరిన ఆయన.. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 2004లో కల్వకుర్తి టికెట్ ఆశించినా.. కూటమి పొత్తుల్లో భాగంగా ఆ సీటు రేవంత్‌కు దక్కలేదు. 2006లో జడ్పీటీసీ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. దీంతో టీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. 2008 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. ఎమ్మెల్సీగా గెలిచిన రేవంత్‌రెడ్డి.. టీడీపీలో చేరారు. టీడీపీలో యాక్టివ్‌గా పనిచేసిన రేవంత్‌రెడ్డికి చంద్రబాబు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ టికెట్ కేటాయించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అనూహ్యంగా ఓటమి పాలైనా.. రేవంత్‌రెడ్డి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో మళ్లీ గెలుపొందారు. ఆ తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు, తెలంగాణలో టీడీపీ బలహీనంకావడంతో రేవంత్‌రెడ్డి ఆ పార్టీని వీడారు. 2017 అక్టోబర్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొన్నారు. రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. 2018లో బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డి.. గెలుపొంది మొదటిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

ఓట్లుగా మారని జనాదరణ

మొదటిపేజీ తరువాయి...

తెలిపింది. లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ విశ్లేషణ చేసినట్టు హిందూ పేర్కొన్నది. దీని ప్రకారం..

- కేసీఆర్ పాలనతో సంతృప్తిగా ఉన్నామని 67 శాతం మంది చెప్పారు. కానీ.. వీరిలో 25 శాతం మంది కాంగ్రెస్‌కు ఓటేశారు.
- కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని 63 శాతం మంది చెప్పారు. ఇందులో 45 శాతం మంది కేసీఆర్‌కు ఓటేస్తామని చెప్పగా, 20 శాతం మంది రేవంత్‌రెడ్డివైపు మొగ్గు చూపారు.
- కేసీఆర్, మోదీ పాలనలో ఎవరిది బాగున్నదని అడిగితే.. 41 శాతం మంది కేసీఆర్‌కు ఓటేయగా, మోదీకి 21 శాతం మంది ఓటేశారు.
- తదుపరి సీఎంగా ఎవరిని చూడాలనుకుంటున్నారని అడిగినప్పుడు.. మహిళల్లో 31 శాతం మంది కేసీఆర్‌కు, 26 శాతం మంది రేవంత్‌రెడ్డి వైపు మొగ్గు చూపారు. పురుషుల్లో 28 శాతం మంది కేసీఆర్‌కు, 32 శాతం మంది రేవంత్‌రెడ్డికి మద్దతు తెలిపారు.

సర్వేలో వెల్లడైన మరిన్ని విషయాలు

- పదేండ్లలో చేపట్టిన కార్యక్రమాల్లో తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్తు, రైతు పథకాలు, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల పెరుగుదల, పేదరిక నిర్మూలనకు చేపట్టిన పథకాలు అత్యధిక ప్రజాదరణ పొందినవిగా పేర్కొన్నది.
- కేసీఆర్‌కు ప్రజాదరణ ఉన్నా.. ఓటర్లు అంతిమంగా ఎమ్మెల్యే అభ్యర్థులను చూసే ఓటేశారని నివేదిక స్పష్టం చేసింది. 38 శాతం మంది ఎమ్మెల్యే అభ్యర్థులను బట్టి ఓటేస్తామని చెప్పగా, 32 శాతం మంది పార్టీకి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. సీఎంను బట్టి ఓటేస్తామని కేవలం 14 శాతం మంది చెప్పగా, మ్యానిఫెస్టోకు అత్యల్పంగా 10 శాతం మంది మాత్రమే మొగ్గు చూపారు.
- రైతుబంధుతో లబ్ధి పొందామని 80 శాతం మంది చెప్పగా, 24 గంటల ఉచిత విద్యుత్తుతో లాభం జరిగిందని 76 శాతం మంది రైతులు పేర్కొన్నారు. అయితే ఇందులో సుమారు 45 శాతం మంది కాంగ్రెస్‌కు ఓటేయడం విచిత్రం. కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వల్ల బీజేపీకి పెద్దగా ప్రయోజనం కలుగలేదు. 61 శాతం మంది రైతులు లబ్ధి పొందామని చెప్పినా.. 9 శాతం మంది మాత్రమే బీజేపీకి ఓటేస్తామని చెప్పారు.
- ప్రజలను నేరుగా కలువడం, ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా ఓటు వేయాలని అభ్యర్థించడంలో బీఆర్ఎస్‌తో పోల్చితే కాంగ్రెస్ దాదాపు 2 శాతం ముందున్నట్టు నివేదిక తెలిపింది. ముఖ్యంగా ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ బాగా వెనుకబడ్డట్టు స్పష్టం చేసింది.

సామాజికవర్గాల వారీగా దళితులు, ఆదివాసీలు, ముస్లింలు కేసీఆర్ వైపు మొగ్గు చూపారు. బీజేపీ బీసీ సీఎం నినాదం ఎత్తుకున్నా, వర్గీకరణ అంటూ హడావుడి చేసినా పెద్దగా ఫలితం కనిపించలేదు. ఆ పార్టీకి అగ్రవర్ణాల్లోనే ఆదరణ ఎక్కువగా ఉన్నది.

సామాజికవర్గాల వారీగా ఆయా పార్టీలను కోరుకున్నవారు..(ప్రతి 100 మందిలో)

సామాజిక వర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
రెడ్లు	49	34	11
ఇతర అగ్రవర్ణాలు	31	37	26
యాదవ, గొల్లకుర్మ	51	33	12
ముదిరాజులు	41	44	14
గౌడ	49	37	18
ఇతర బీసీలు	36	37	18
దళితులు	38	41	8
లంబాడీ	52	40	4
ఇతర ఎస్టీలు	38	48	9
ముస్లింలు	32	35	2

వయసుల వారీగా పరిశీలించినప్పుడు యువ ఓటర్లు రేవంత్‌రెడ్డి వైపు చూడగా, మధ్య వయస్కులు, వృద్ధులు కేసీఆర్ కావాలన్నారు.

వయసు	కేసీఆర్	రేవంత్‌రెడ్డి
25 ఏండ్లవరకు	28	32
26–35 ఏండ్లు	26	32
36–45 ఏండ్లు	31	27
46–55 ఏండ్లు	29	27
56 ఏండ్లకుపైన	37	28

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీలో..

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో స్పెషల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్–1, 2)
- **విభాగాలు:** ఏఐ, బయో మెడికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్, ఫిజిక్స్, సీఎస్ఈ
- **నోట్:** ఈ పోస్టులు మహిళలకు మాత్రమే కేటాయించారు
- **అర్హతలు:** పీహెచ్‌డీ ఉత్తీర్ణత
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 22
- **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

ఏఐఏటీఎస్ఎల్‌లో..

ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటీఎస్ఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 128
- **పోస్టులు:** కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్/ జూనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీలు:** డిసెంబర్ 18, 20, 22
- **వెబ్‌సైట్:** https://www.aiasl.in

ఈసీఐఎల్‌లో..

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- అప్రెంటిస్ (గ్రాడ్యుయేట్, డిప్లొమా/టెక్నీషియన్)
- **మొత్తం ఖాళీలు:** 363
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** డిసెంబర్ 15
- **వెబ్‌సైట్:** https://www.ecil.co.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఇండియన్ పాలిటీ, జాగ్రఫీ, కెమిస్ట్రీ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

శబరిమలకు 32 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): శబరిమలకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 32 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్–కొట్టాయం రైల్వేస్టేషన్ల మధ్య 18 రైలు సర్వీసులు, మచిలీపట్నం–కొట్టాయం మధ్య 10 సర్వీసులు, సికింద్రాబాద్–కొట్టాయం మధ్య 4 సర్వీసులను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

సవారమ్మకు ఎమ్మెల్యే బండ్ల దంపతుల పూజలు

*అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జ్యోతి దంపతులు.. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం దాసరిపల